క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



అశోక్ కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న స్నేహితులు

యాచారం: చిన్ననాటి స్నేహితుడి కుటుంబ సభ్యులకు తోటి స్నేహితులు ఆర్థిక సహాయం చేసి ఆదుకున్నారు. వివరాలు... మండల పరిధిలోని కుర్మిద్ద గ్రామానికి చెందిన బైకని అశోక్ కొద్దిరోజుల కింద రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కందుకూర్ మండలం మీరాఖాన్‌పేట ఉన్నత పాఠశాలలో అశోక్ పదోతరగతి చదివాడు. అశోక్ చిన్ననాటి స్నేహితులు ఆదివారం కుర్మిద్ద గ్రామానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులకు రూ.50వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆర్థిక సహాయం అందజేసిన వారిలో సురేష్, శ్యామ్, మహేందర్ రెడ్డి, నరేష్, శ్రీకాంత్, ప్రశాంత్, భరత్, కిరణ్, కల్పన, వసంత తదితరులు ఉన్నారు.

ఆటల్లో గెలుపోటములు సహజం: ఏసీపీ



నాగిరెడ్డిపల్లి జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఏసీపీ శ్రీనివాస్

మహేశ్వరం: ఆటలో గెలుపోటములు సహజమని, ఓటమి చెందిన వారు వెనుకడుగు వేయకుండా ముందుకు సాగాలని మహేశ్వరం ఏసీపీ బి.శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల పరిధిలోని పెండ్యాలలో నవభారత్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు శనివారం రాత్రి ముగిశాయి. దీనికి ఏసీపీ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత చదువుతో పాటు క్రీడల పట్ల చొరవ చూపాలన్నారు. క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసికోల్లాసం పెంపొందుతాయన్నారు. గ్రామంలో 24 ఏళ్ల నుంచి నవభారత్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సట్టి బాలకిష్టమ్మ /ాప కార్థం కుమారులు రామిరెడ్డి, లక్ష్మారెడ్డి, సంజీవరెడ్డి, అంజిరెడ్డిల సహకారంతో పోటీలు నిర్వహించారన్నారు.

60 జట్లు పాల్గొనగా..

పోటీల్లో మొత్తం సుమారు 60 జట్లు పాల్గొన్నారు. ఫైనల్ పోరులో నాగిరెడ్డిపల్లి, రావిర్యాల జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. విన్నర్‌గా నాగిరెడ్డిపల్లి, రన్నర్‌గా రావిర్యాల జట్లు గెలుపొందాయి. పాఠశాల విభాగంలో మొదటి బహుమతి కేశంపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ద్వితీయ బహుమతి వివేకనంద హైస్కూల్ మన్సాన్‌పల్లి జట్లు విజయం సాధించాయి. తాడు లాగుడు పోటీలో విన్నర్‌గా మహేశ్వరం జిమ్, రన్నర్‌గా పెండ్యాల జట్లు గెలుపొందాయి. విజేతకు రూ.30,000, ద్వితీయ స్థానానికి రూ.15 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో సీఐ ముని, నవభారత్ యూత్ క్లబ్ సభ్యులు, గ్రామస్తులు రాజేశ్, యాదయ్య గౌడ్, సంజీవరెడ్డి, రామకృష్ణారెడ్డి, హన్మంత్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, బాల్‌రాజ్, సుధాకర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వజ్రంరెడ్డి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

యాదవ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

నాగోలు: కొత్తపేట డివిజన్ మారుతీనగర్ యాదవ సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా, కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్, మాజీ మున్సిపాల్ వైస్ చైర్మన్ లింగాల నాగేశ్వర్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్ని కేలండర్‌ను ఆవిష్కరించారు. యాదవ సంఘం నాయకులందరికీ భోగి పండుగ, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు శ్రీనివాస్ యాదవ్, కృష్ణ యాదవ్, గోపాల్ యాదవ్, సురేష్ యాదవ్, వెంకటేష్ యాదవ్, లింగాల నగేశ్వర్ గౌడ్ పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా ఐవీఎఫ్

చంపాపేట: అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) నిరుపేదలకు ఎల్లపుడూ అండగా ఉంటుందని ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస గుప్తా అన్నారు. ఆదివారం వనస్థలిపురం వాసవి కల్యాణ మండపంలో ఫెడరేషన్ సభ్యుడు చింతల రజనీకాంత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.ఫెడరేషన్ ఆధ్వర్యంలో పేద మెరిట్ విద్యార్థులకు సహాయ, సహకారాలు అందించడంతో పాటు పలు కాలనీల్లో ఉచిత వైద్యశిబిరాలు, పేద విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్నామన్నారు. అనంతరం శ్రీనివాస గుప్తా చేతుల మీదుగా పేదలకు దుప్పట్లు అందజేసి, ఫెడరేషన్ నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. నిరుపేదలకు ఐవీఎఫ్ అండగా ఉంటుందన్నారు.సేవా కార్యక్రమాలు చేపడతుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ వెంకటేశ్వరరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు లక్ష్మీప్రసన్న, నాయకులు చంద్రశేఖర్, కట్ట రవి, ఫెడరేషన్ సభ్యులు భాగ్యలక్ష్మి, విజయ్‌గుప్తా, సరిత పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం: ఇంటి ముందు ముగ్గు వేస్తున్న చిన్నారి



యాచారం: ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు



ఇబ్రహీంపట్నం రూరల్: బంటి యూత్ ఆధ్వర్యంలో పతంగుల పంపిణీ

సంక్రాంతి సంబురాలు

భోగి పర్వదినంతో మూడు రోజుల సంక్రాంతి సంబురాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల్లో ప్రజలు భోగి వేడుకకు స్వాగతం పలికారు. వాకిళ్లలో మహిళలు రంగురంగుల ముగ్గులు వేశారు. పలు గ్రామాల్లో ముగ్గుల, క్రీడా పోటీలను నిర్వహించారు. పిల్లలు, యువత పతంగులు ఎగురవేసేందుకు ఉత్సాహం చూపారు. గంగిరెద్దులు సందడి చేశాయి. వేడుకల్లో స్థానిక నాయకులు పాల్గొని ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

– సాక్షి, నెట్‌వర్క్



కడ్తాల్: భోగి వేడుకలో నాయకులు, స్థానికులు



ఇబ్రహీంపట్నం: గంగిరెద్దులతో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



ఆమనగల్లు: చిన్నారులపై భోగిపండ్లు పోస్తున్న తండ్రి



ఇబ్రహీంపట్నం: క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న వెంకటేశ్



హస్తినాపురంలో భోగి వేడుకలు

కాలనీలో రోడ్ల నిర్మాణం పూర్తి చేయిస్తా: ఎమ్మెల్యే



ఆటో సాయినగర్‌లో పర్యటించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: నియోజక వర్గంలోని వివిధ ప్రాంతాల్లో మిగిలిపోయిన రోడ్ల నిర్మాణాలను వెంటనే చేపట్టేందుకు చర్యలు తీసుకుంటానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని ఆటోసాయినగర్‌లో కాలనీవాసుల వినతి మేరకు ఆయన పర్యటించారు. కాలనీలోని సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. గతంలో కాలనీలో అంతర్గత రోడ్లు నిర్మించారని, మరికొన్ని రోడ్లు నిర్మించాల్సి ఉందని వాటిని త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు. మిగిలిన రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేయిస్తానని కాలనీవాసులకు ఎమ్మెల్యే హామీ యచ్చారు.

వెల్జాల్‌లో అక్షితల శోభాయాత్ర

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్‌లో సర్పంచ్ సంగీత ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటికి అయోధ్య అక్షితలు అందజేశారు. అక్షింతలతో గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, విష్ణువర్ధన్ యాదవ్, నరేందర్‌గౌడ్, శ్రీను, నర్సిరెడ్డి, సుదర్శన్, ఆంజనేయులు, చెన్నయ్య, విజయ్‌కుమార్, రాఘవేందర్, సుధాకర్, రాజు, లింగం, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా గోదా కల్యాణం



తలకొండపల్లి: వేంకటేశ్వర స్వామి ఆలయంలో..

తలకొండపల్లి: మండల పరిధిలోని దేవుని పడకల్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదారంగానాథస్వామి కల్యాణోత్సవం ఆదివారం కనులపండువగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. శుద్ధజలం, పంచామృతాలతో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు సమకూర్చిన పట్టు పీతాంబుర వస్త్రాలను దేవతా మూర్తులకు ధరింపజేశారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య మంగళసూత్రధారణ గావించారు. అనంతరం శ్రీవేంకటేశ్వరస్వామి పుణ్య దంపతుల విగ్రహాల ఊరేగింపు జరిపించారు. కల్యాణ మండపం నుంచి ఆలయ ప్రాంగణం వరకు దేవతా మూర్తులను ఊరేగించారు. హైదరాబాద్, శంషాబాద్, షాద్‌నగర్, అచ్చంపేట్, కల్వకుర్తి, మహబూబ్‌నగర్, జడ్చర్ల తదితర పట్టణాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాజ్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ శ్రీశైలం, శతాబ్ది టౌన్‌షిప్ ప్రొప్రయిటర్ శ్రీనివాస్‌రెడ్డి, అర్చకులు రామాచారి, పద్మనాభచారి, హరికిషన్‌రెడ్డి, జగ్గారెడ్డి, సత్తయ్య, వెంకటయ్య, రాజు, యాదయ్య, ఆలయ సిబ్బంది, క్లర్క్ ఆంజనేయులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: కల్యాణం జరిపిస్తున్న పూజారులు

పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలో..

హయత్‌నగర్: పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలోని తట్టిఅన్నారం హనుమాన్‌నగర్‌లో శ్రీ రంగనాథ సమేత గోదా దేవి కల్యాణోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున వచ్చి ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ కల్యాణంతో గత 30 రోజులుగా జరుగుతున్న తిరుప్పావై ఉత్సవాలు ముగిసినట్లు ఆంజనేయ స్వామి దేవాలయ కమిటీ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి రమేష్, జగన్మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రావుల గోపాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సమీపంలోని స్వయం భూ శ్రీ లక్ష్మీనరసింహస్వామి గుట్టపై గల రామాలయ మండపంలో శ్రీ గోదా సమేత రంగనాథస్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో వేడుకల్లో పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని శ్రీ వేంకటగిరి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో గత నెలరోజులుగా ధనుర్మాస ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ధనుర్మాస ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం శ్రీ గోదారంగనాథస్వామి కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయాన్ని పూలు, విద్యుత్ కాంతులతో శోభాయమానంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలించారు. ఉత్సవంలో మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ రజిత, పూజారి గూడ కృష్ణమాచార్యులు, స్థానికులు పాపిశెట్టి రాము, దేవేందర్‌శెట్టి, జగన్, సురేశ్, ఆనంద్ పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం



టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో భరత్‌కుమార్, నాయకులు

మున్సిపల్ మాజీ చైర్మన్ భరత్‌కుమార్

ఇబ్రహీంపట్నం: క్రీడలు స్నేహ భావంతో పాటు మానసికోల్లాసాన్ని పెంపొందిస్తాయని ఇబ్రహీంపట్నం మాజీ మున్సిపల్ చైర్మన్ కంబాలపల్లి భరత్‌కుమార్ అన్నారు. శేరిగూడ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ సీజన్–4ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు యువతలో ఉత్తేజాన్ని, ఉత్సాహన్ని కలిగిస్తాయన్నారు. గెలుపోటములను అందరూ సమానంగా స్వీకరించాలన్నారు. క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. ఈ ప్రారంభోత్సవంలో బీఆర్‌ఎస్ నాయకులు మోహన్‌రెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ శంకర్, విద్యా కమిటీ చైర్మన్ సురేందర్, అంజయ్య, నిర్వాహకులు నరేష్ టిల్లు, పవన్ పాల్గొన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ టోర్నమెంట్లో 8 జట్లు పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తాం

తలకొండపల్లి: క్రీడలతో ఐకమత్యం పెరుగుతుందని సర్పంచ్ బక్కి కుమార్ అన్నారు. మండల పరిధిలోని చంద్రధన యూత్ ఆధ్వర్యంలో చంద్రధన ప్రీమియర్ లీగ్ (సీసీపీఎల్) క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం సర్పంచ్ కుమార్, ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి ప్రారంభించారు. సర్పంచ్.. గ్రామీణ ప్రాంతాల్లో ఈ క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల నైపుణ్యాలను వెలికి తీసి, వారిని ఉన్నతస్థాయికి తీసుకెళ్లేందుకు ఇలాంటి క్రీడాపోటీలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. యువత క్రీడల్లో రాణించి ఉన్న ఊరు, కన్న తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుధాకర్, నాయకులు.. భాను, అంకుశ్, నరేష్, శేఖర్, భరత్, రవీందర్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయంపై నేతల హర్షం

ఆమనగల్లు: ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు గ్రహీత ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన దివంగత నేత సూదిని జైపాల్‌రెడ్డి జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడం పట్ల ఆమనగల్లు మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు మండ్లి రాములు హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలకంగా వ్యవహరించిన సూదిని జైపాల్‌రెడ్డి సేవలను గుర్తించిన సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 16న హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో జైపాల్‌రెడ్డి స్మృతివనం దగ్గర జరిగే జైపాల్ రెడ్డి జయంతి వేడుకలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని మండ్లి రాములు కోరారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఆయన పరితపించారన్నారు.

సేవలను గుర్తించారు

మాడ్గుల: ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు గ్రహీత, దివంగత నేత సూదిని జైపాల్ రెడ్డి జయంతి, వర్ధంతి కార్యక్రమలను అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై మాడ్గుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జైపాల్‌రెడ్డి సేవలను గుర్తించారన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

వైస్ ఎంపీపీ అనంతరెడ్డి

ఆమనగల్లు: అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజలు భాగస్వాములు కావాలని ఆమనగల్లు వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి కోరారు. ఆమనగల్లు మండలం మంగళపల్లిలో మండలపరిషత్ నిధులు రూ.1.75 లక్షలతో చేపడుతున్న పైప్‌లైన్ నిర్మాణ పనులను సర్పంచ్ తిప్పిరెడ్డి నర్సింహారెడ్డితో కలిసి అనంతరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అనంతరెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరారు. అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వామ్యం కావాలన్నారు. మంగలపల్లి, చింతలపల్లిలో ప్రజల సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషిచేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సాయికుమార్, మాజీ ఎంపీటీసీ జంగయ్య, నాయకులు సురేందర్‌రెడ్డి, అంతయ్య, కొండల్‌యాదవ్ తదితరులు ఉన్నారు.



పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న అనంతరెడ్డి

ఎమ్మార్పీఎస్ కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

కందుకూరు: తెలంగాణ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 29న చేపట్టనున్న పోరు గర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ ఆ సంఘం సభ్యులు ఆదివారం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మేడి మహేష్‌మాదిగ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మంద రాజుమాదిగ మాట్లాడుతూ.. డప్పు, చెప్పు వృత్తిదారులకు పింఛన్లు ఇవ్వాలని, పారిశుద్ధ్య కార్మికులను క్రమబద్ధీకరించాలని కోరారు. వచ్చే నెల 29న రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో చేపట్టనున్న బహిరంగ సభకు భారీ సంఖ్యలో మాదిగ, మాదిగ ఉప కులాలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కంద పెద్ద నర్సింహ, నాయకులు నరసింహామాదిగ, కృష్ణమాదిగ, జంగయ్యమాదిగ, నరసింహామాదిగ, యాదయ్య, సురేశ్ పాల్గొన్నారు.

వసతుల కల్పనకు చర్యలు

హస్తినాపురం: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాలలో మౌలిక వసతులు కల్పించేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటామని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ అన్నారు. ఆదివారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని సాయినగర్ కాలనీలో కాలనీ ప్రతినిధులతో కలిసి పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ యాత్ర విజయవంతానికి పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న మేయర్ పారిజాత దంపతులు

బడంగ్‌పేట్: రాహుల్‌గాంధీ చేపట్టిన 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' విజయవంతం కావాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక కాంగ్రెస్ కార్పొరేటర్లతో కలిసి బడంగ్‌పేట్‌లోని కాశీబుగ్గ దేవాలయంలో ఆదివారం అభిషేకాలు నిర్వహించారు. మొక్కులు తీర్చుకొని 1,116 కొబ్బరి కాయలు కొట్టారు. అనంతరం మేయర్ పారిజాత మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ చేపట్టిన యాత్ర ప్రజల ఆశీర్వాదంతో విజయవంతంగా పూర్తి కావాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, రామ్‌చందర్, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, మల్లారెడ్డి, బాలకృష్ణ, రాకేశ్, భాస్కర్‌రెడ్డి, కిరణ్, మహిళలు పాల్గొన్నారు.